క్లుప్తంగా

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



పెంటలో రైతులతో ఈకేవైసీ చేయిస్తున్న శారద

జి.సిగడాం: ప్రతి రైతు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి యర్రా శారద సూచించారు. నాగులవలస, పెంట గ్రామాల్లోని రైతుల ఇంటి వద్దకు బుధవారం వెళ్లి ఈకేవైసీ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించే ప్రతి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు సమగ్రంగా ఉండడంతోపాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ తలచింతల కుసుమ ఉన్నారు.

ఆనందపురంలో వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బంది బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చిత్తిరి మోహన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోగుల ఇంటి వద్దకే వెళ్లి సిబ్బంది వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. స్థానిక సర్పంచ్ చిత్తిరి మంజు, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి ఏఎన్‌ఎం ఎ.నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచకుడు మృతి



యాచకుడి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: అనారోగ్యంతో యాచకుడు మృతి చెందాడని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి సమీపంలో శాంతినగర్ కాలనీ పరిధిలో 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి ఓ షాపు మెట్లపై మృతి చెంది ఉన్నట్టు స్థానికులు అందించిన సమాచారం మేరకు రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మి తమ సిబ్బంది, క్లూస్ టీం పరిశీలించారు. మృతుని శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. నోటి నుంచి రక్తం వచ్చినట్టు గుర్తించారు. ఈయన పట్టణంలోని పలు కూడళ్లలో యాచక వృత్తి కొనసాగిస్తూ జీవనం సాగించేవాడని పోలీసులు తెలుసుకున్నారు. మంగళవారం రాత్రే రక్తపు వాంతులు చేసుకుని చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. శాంతినగర్ కాలనీ సచివాలయం వీఆర్వో బొడ్డ రామ్‌జీ స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించామని.. ఇక్కడే రెండు రోజులు ఉంచుతామని సీఐ చెప్పారు.

వృద్ధాశ్రమం సందర్శన



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు బుధవారం స్థానిక ఖ్యాతి ఫౌండేషన్ నడుపుతున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా న్యాయ సహాయం కావలసి వస్తే జిల్లా న్యాయసేవ అధికార సంస్థ తక్షణం స్పందించి వెంటనే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తోందన్నారు.వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. ఖ్యాతి ఫౌండేషన్ సెక్రటరీ శ్రావణి, న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

దుప్పలవలసలో కొట్లాట

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలస గ్రామంలో ఇరువర్గాల మధ్య బుధవారం కొట్లాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిపై వివాదం తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 16 మందిపై కేసు నమోదు చేశామన్నారు. సర్వే నంబర్ 160–6లో ఉన్న 1.98 ఎకరాల భూహక్కుకు సంబంధించి వివాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ సంఘటనలో వెంకటసాయిరాం, రాజేశ్వరి గాయపడడంతో వీరిని చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కి తరలించినట్టు చెప్పారు. కేసును రెవెన్యూ శాఖకు రిఫర్ చేయనున్నట్టు ఎస్సై సత్యనారాయణ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డీడీవోలదే హాజరు బాధ్యత

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ ఉద్యోగుల ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ (ముఖ గుర్తింపు వ్యవస్థ) ఆధారిత హాజరు బాధ్యత డీడీవోలదేనని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ అన్నారు. హాజరు అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సాధారణ పరిపాలన అధికారి ముత్యాలరాజు, సీఎఫ్‌ఎంఎస్ అధికారి సునీల్ రెడ్డి బుధవారం వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు. ప్రతి ఉద్యోగి ఏపీఎఫ్‌ఆర్‌ఎస్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- అన్నింటా బీసీలకు ప్రాధాన్యం
- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి సామాజిక న్యాయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీలకు ఎక్కువ ఎమ్మెల్సీ సీట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేడ్కర్ భావజాలంతో దేశంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని నిరూపించుకున్నారన్నారు. ప్రజా సంకల్పయాత్రలో వెనకబడిన వర్గాలను చట్టసభల్లోకి తీసుకొస్తానని ఇచ్చిన హామీని అమలు చేసి చూపించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోని వచ్చిన తరువాత మొత్తం 36 ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేయగా.. వీరిలో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అవకాశం కల్పించి ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకునేలా చేశారన్నారు. తాజాగా 18 ఎమ్మెల్సీ స్థానానాలకు అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ ఇలా 14 స్థానాలు కేటాయించి బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ క్యాస్ట్ అని తాను నిత్యం చెప్పే నినాదాన్ని నిజం చేశారన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రులు, రాజ్యసభ స్థానాలు అధిక స్థానాలు బీసీలకే ఇవ్వడం జరిగిందన్నారు. శాసనసభ స్పీకర్ బీసీ, శాసనమండలి చైర్మన్ ఎస్సీ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ మైనారిటీకి చెందినవారేనన్నారు. ఇలా రాజ్యాంగ పదవులు సైతం ఆ సామాజిక వర్గాలకే ఇచ్చారన్నారు. జెడ్పీ చైర్మన్లు, నగర మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు ఇలా అన్ని పదవులు సామాజిక వర్గాలకే దక్కాయని ఎమ్మెల్యే కిరణ్ పేర్కొన్నారు. గత 44 నెలల కాలంలో వివిధ సంక్షేమ పథకాల కింద 1.93 లక్షల కోట్ల రూపాయలను ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. అందులో 76 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీవర్గాలకు నేరుగా వారి అకౌంట్లకు జమ చేసినట్టు వివరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండు లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తే వాటిలో అత్యధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎంపికయ్యారని చెప్పారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన పగ్గాలు చేపట్టిన కొద్ది సంవత్సరాల్లోనే సామాజిక న్యాయానికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చారన్నారు. సమావేశంలో రణస్థలం మండల ఎంపీటీసీ సభ్యుల సంఘం అధ్యక్షుడు మహంతి చినరామినాయుడు, చిన్నరొంపివలస పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుడు చిత్రి విజయ్ కుమార్ ఉన్నారు.

వేతనదారులందరికీ 'ఉపాధి'



వేతనదారులతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

గార: వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పించేలా పంచాయతీ స్థాయిలోనే చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. వత్సవలస పంచాయతీ ఆమదాలపాడులో అమృత్ సరోవర్‌లో భాగంగా అభివృద్ధి చేస్తున్న చెరువు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీ కనీసం 200 మందికి పని కల్పించాలన్నారు. వేతనదారులకు వంద రోజులు పని కల్పించేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పనకు అవసరమైన పనులను గుర్తించి అంచనాలను తక్షణం అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. వేతనదారులనుద్దేశించి మాట్లాడుతూ.. మన గ్రామం, మన పని అనే ఆలోచనతో పనిచేసి స్వయం సమృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సంధ్యారాణి, తెలుకోటి అప్పారావు, జేఈ నారంనాయుడు ఉన్నారు.

క్యాన్సర్ గుర్తింపునకు ప్రత్యేక శిబిరాలు

శ్రీకాకుళం: క్యాన్సర్ గు ర్తింపునకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు రిమ్స్ వైద్య కళాశాల, ప్రభు త్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామినాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం నరసన్నపేట మండలం మననడగాం గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. వెల్ స్కోప్ పరికరం ద్వారా నోటి క్యాన్సర్ ముందస్తు గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సమస్య గుర్తించి, రోగ నిర్ధారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజయానికి కృషి చేయాలి

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం రాత్రి మద్రివలస గ్రామ సర్పంచ్ విక్రం కోటిబాబుతో కలిసి ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్, స్థానిక సంస్థల అభ్యర్థి నర్తు రామారావులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: తహసీల్దార్ కార్యాలయాల్లో పని చేస్తున్న నైట్ వాచ్‌మెన్లకు బకాయి పడిన 23 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, జిల్లా రెవెన్యూ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిలి రామారావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డేవిడ్, పాలక హరీష్, జి.మోహనరావు పాల్గొన్నారు.

కళింగ జాతి ఆత్మగౌరవం రాజగోపాలరావు



రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సువ్వారి గాంధీ



రాజగోపాలరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సత్యవతి తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళింగజాతి ఆత్మగౌరవం దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు అని వైఎస్సార్‌సీపీ నాయకుడు సువ్వారి గాంధీ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కిమ్స్ రోడ్డులో బుధవారం రాజగోపాలరావు 31వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. రాజకీయ లెజెండరీ రాజగోపాలరావు కారణంగానే దేశ నలుమూలలకూ కళింగ జాతి ఉనికి, విశిష్టత తెలిసిందన్నారు. శ్రీకాకుళం లోక్‌సభనియోజకవర్గం నుంచి 1952 –1984 మధ్య కాలంలో ఆరు సార్లు భారత పార్లమెంటుకు ఎన్నికయ్యారన్నారి గుర్తు చేశారు. వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా జిల్లాను అభివద్ధి చేశారన్నారు. వంశధార ప్రాజెక్టుకు అప్పటి ముఖ్యమంత్రి సంజీవయ్య చేత శంకుస్థాపన చేయించారన్నారు. ఆమదాలవలసలో సుగర్ ఫ్యాక్టరీ, పారిశ్రామికవాడ, శ్రీకాకుళంలో పారిశ్రామికవాడ, పారిశ్రామిక శిక్షణ సంస్థల స్థాపనలో ఆయన కృషి మరువరానిదన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాగా శ్రీకాకుళాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించడంలో కృషి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పైడి విజయ్, కొంచాడ ఎంపీటీసీ సభ్యుడు పి.ప్రసాద్, పైడి ముకుందరావు, తిర్లంగి రాము, తమ్మినేని రవీంద్ర, పేడాడ రాజు, పైడి ప్రసాద్, సీపాన దాలినాయుడు పాల్గొన్నారు.

రాజగోపాలరావుకు నివాళి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలకు స్ఫూర్తిప్రదాత దివంగత మాజీ పార్లమెంట్ సభ్యుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు అని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. రాజగోపాలరావు వర్ధంతి సందర్భంగా కిమ్స్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అభివృద్ధి కోసం విశేషమైన సేవలందించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పైడి మహేశ్వరరావు, సనపల అన్నాజీ, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

శర్వాణీలో స్పోర్ట్స్ మీట్



మాస్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న సూరిబాబు, వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ: పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులకు క్రీడలు, వ్యాయామంతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జిల్లా నెహ్రూ యువకేంద్రం యూత్ అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. అరసవల్లి రోడ్‌లోని 'శర్వాణీ విద్యాలయ' పాఠశాలలో బుధవారం 'ఏన్యువల్ స్పోర్ట్స్ మీట్' పేరిట వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యాలయ సంస్థల అధినేత, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ.. శర్వాణీలో ప్రతి విద్యార్థి సర్వతోముఖవికాసం కోసం అనేక వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.


ఎన్‌సీఎస్‌లో వరల్డ్ థింకింగ్ డే వేడుకలు



స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులతో శ్రీకాంత్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్ వేదికగా బుధవారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు జరిగాయి. స్కౌట్ వ్యవస్థాపకులు లార్డ్ రాబర్ట్ బోడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్ స్కౌట్ జెండాను ఆవిష్కరించి, వందనం సమర్పించారు.

వసతి గృహాలు పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం రూరల్: జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు సింగుపురం, అంపోలులోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను బుధవారం పరిశీలించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా సూచనల మేరకు వీటిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి భవనాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులకు భద్రత కల్పించాలని, వారిపై దాడికి, హత్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు బుధవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ముందుగా కోర్టు ఆవరణ నుంచి కాంప్లెక్సు వరకు ర్యాలీ నిర్వహించారు. కర్నూలు జిల్లాలో న్యాయవాదిపై దాడికి పాల్పడిన తీరును తీవ్రంగా ఖండించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జిపురం ఫల్గుణరావు, న్యాయవాదులు జల్లు తిరుపతిరావు, బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు ఆగూరు ఉమామహేశ్వరరావు, కూన అన్నంనాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు అభినందన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సబ్–జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రజత పతకాలు సాధించిన సిక్కోలు క్రీడాకారిణులు ఎస్.నందిని, ఎం.గాయిత్రిలను ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, సామాజికవేత్త సూర శ్రీనివాసరావు బుధవారం అభినందించారు.

నర్తు నామినేషన్‌కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నామినేషన్ ప్రక్రియకు బయలు దేరిన పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు నామినేషన్ వేసే ప్రక్రియ బుధవారం ఉత్సాహంగా జరిగింది. పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయగా.. జిల్లా వ్యాప్తంగా నాయకులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సాయిరాజ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వీరంతా జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి కలెక్టరేట్‌కు వెళ్లారు.

బీసీలకు పెద్దపీట వేసిన సీఎం జగన్

- మాజీ ఎమ్మెల్యే నీలకంఠంనాయుడు



మాట్లాడుతున్న నీలకంఠంనాయుడు

జి.సిగడాం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠంనాయుడు అన్నారు. ఎస్‌పీఆర్ పురం గ్రామంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. స్థానిక సంస్థల నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి జగన్ ప్రకటించిన నర్తు రామారావుకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలన్నారు. రామారావును అభ్యర్థిగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి వివరించాలన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎచ్చెర్ల తహసీల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో కుమార్ పట్నాయిక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల వద్ద రాజకీయ నాయకుల ప్రచార ఫ్లెక్సీలు, పోస్టర్లు, ప్రభుత్వ పథకాల ప్రచార సమాచారం సైతం ఉండకూడదని చెప్పారు. జాతీయ రహదారికి అనుకొని ఉన్న సచివాలయ సిబ్బంది రోడ్డు పక్కల, పబ్లిక్ స్థలాల్లో ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ఎన్నికల కోడ్ అమలు సమాచారం వాట్సప్, టెలిగ్రాం గ్రూపుల్లో అందుబాటులో ఉంచాలని వివరించారు. ఎన్నికలు కోడ్ పూర్తయ్యేవరకు నిబంధనలు పాటించాలని సూచించారు.

రైతుల సహకారంతోనే భూసర్వే వేగవంతం

జి.సిగడాం: రైతుల సహకారంతోనే భూసర్వే వేగవంతం సాధ్యమని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సచివాలయాల సర్వేయర్లతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే చేసినప్పుడు తప్పని సరిగా ఆయా రైతు భూమి వద్ద ఉండి హక్కులను చూపించాలని కోరారు. సమగ్ర భూసర్వేతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. కప్పరాం, జగన్నాథపురం, నాయుడువలస, ఆనందపురం, నర్సిహంపురం గ్రామాల్లో సర్వే పూర్తి చేసి రైతులకు పట్టాలను పంపిణీ చేశామన్నారు. ఎందువ, జాడ, మధుపాం, ముషినివలస, పాలఖండ్యాం, అబోతులపేట, గేదెలపేట, వెంకయ్యపేట, చంద్రయ్యపేట, గంగువారి సిగడాం, వెలగాడ, గంగన్నదొరపాలెం, టంకాల దిగ్గువలస గ్రామాల్లో భూసర్వే శరవేగంతో జరుగుతుందన్నారు. అబోతులపేట, గేదెలపేట గ్రామాల్లో సర్వే చివరిదశకు చేరుకుందన్నారు. రైతులు సహకరిస్తే సర్వేను మరింత వేగవంతం చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ఎస్.నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు ఉన్నారు.

మురపాక విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

లావేరు: మురపాక హైస్కూల్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ బుధవారం అభినందించారు. మురపాక హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి ఇంగ్లిషు మీడియం చదువుతున్న విద్యార్థులు జి.గౌతమి, జె.యోజన, కె.యశస్విని, బి.యశ్వంత్, పి.వసుంధర్‌లు ఫార్మర్ అలెర్టు అలారం ఫ్రమ్ ఎలక్ట్రిక్ షాక్ ఇన్ అగ్రికల్చర్ అనే దానిపై చేసి పంపిన వీడియో జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టును ఈనెల 16 నుంచి 20వతేదీ వరకూ బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించగా బెస్టు కోలాబ్రేషన్ అవార్డు లభించింది. దీంతో ఉపాధ్యాయురాలు పూర్ణిమ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో జిల్లా కలెక్టర్ కలిసి విషయాన్ని తెలియజేశారు. ఆయన విద్యార్థులను, గైడ్ టీచర్‌గా వ్యవహరించిన పూర్ణిమను అభినందించారు. అలాగే డీఈవో పగడాలమ్మ, డిప్యూటీ ఈవో తిరుమల చైతన్య కూడా వీరికి అభినందనలు తెలియజేశారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు



రాపర్తి జగన్నాథం (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భర్త కనిపించడం లేదని పట్టణానికి చెందిన ఓ వివాహిత ఫిర్యాదు చేసినట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గణేష్ బుధవారం తెలిపారు. 2016లో ఒప్పంగి గ్రామానికి చెందిన రాపర్తి జగన్నాథం (42)ను పట్టణంలోని సానివాడ కాలనీకి చెందిన శ్రావణి ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు బాబులున్నారు. దంపతులు కూలి పనులు చేసుకొని జీవిస్తూ ప్రస్తుతం చినబరాటం వీధిలో నివసిస్తున్నారు. జగన్నాథానికి మద్యం అలవాటు ఉండడంతో కుటుంబ బాధ్యతలు శ్రావణి నిర్వర్తిస్తుండేది. ఇదే క్రమంలో ఈ నెల పదో తేదీన అద్దె డబ్బులు కట్టలేదా.. ఇలా అయితే కుటుంబాన్ని ఎలా నెట్టుకొచ్చేదంటూ శ్రావణి భర్త జగన్నాథాన్ని మందలించింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన తిరిగి రాలేదు. బంధువులు, తెలిసినవాళ్ల వద్ద వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం



న్యాయ విశ్వవిద్యాలయం వీసీ సూర్యప్రకాష్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా విద్యా విధానం కొనసాగాలని విశాఖపట్నానికి చెందిన దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడు రోజులు నిర్వహించనున్న బోధన సిబ్బంది నైపుణ్యా ప్రగతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన సిబ్బంది నిరంతర విద్యార్థుల్లా ఉండాలని చెప్పారు. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సుల్లో బోధన ఉండాలన్నారు. అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దేలా విద్యావిధానంలో మార్పులు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

డీఎల్‌టీసీలో స్వల్పకాలిక ఉపాధి కోర్సులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో స్వల్పకాలిక ఉపాధి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టినట్టు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్‌మోహనరావు బుధవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని పీఎంకేవీవై 4.0 కార్యక్రమం ద్వారా 3 నెలల కాలవ్యవధితో కూడిన ఉచిత స్వల్పకాలిక శిక్షణ తరగతులను నిర్వహించడంతో పాటు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మల్టీస్కిల్ టెక్నీషియన్ (ఎలక్ట్రికల్), డేటా ఎంట్రీ ఆపరేటర్, వెల్డింగ్, సూయింగ్ మెషీన్ ఆపరేటర్ (టైలరింగ్–మహిళలకు మాత్రమే) కోర్సులను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి.. అర్హత కలిగిన అభ్యర్థు తమ టెన్త్‌క్లాస్, కుల, ఆధార్‌కార్డు ధ్రువపత్రాలతోపాటు రెండు పాస్‌ఫొటోలతో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల్లోగా బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీలో సంప్రదించాలని సూచించారు.

మహిళల భద్రతే ధ్యేయంగా..!

- ఆకట్టుకున్న స్ఫూర్తి పోలీసు కళా బృందం నాటక ప్రదర్శనలు



గొంటివీధిలో నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మి బృందం

శ్రీకాకుళం క్రైమ్: మొన్న ఆపరేషన్ పరివర్తన్(2.0).. నిన్న క్యాంపస్ కాప్స్.. ఇప్పుడు మహిళల భద్రతే ధ్యేయంగా జిల్లాలోని పోలీసు సిబ్బంది 'స్ఫూర్తి పోలీసు కళా బృందం'గా ఏర్పాటు చేసి నాటక ప్రదర్శనల ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేలా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఎస్పీ జి.ఆర్.రాధిక. నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలు, వీధుల్లో ఒకటి, రెండో పట్టణ పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత కాలంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, వాటినుంచి కాపాడే చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు చేస్తే ఎదుర్కొనే సమస్యలు, మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు బానిస కావడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనర్థాలు వంటి అంశాలపై చైతన్యపరుస్తున్నారు. జిల్లాలోని మూడు సబ్ డివిజన్లలో మూడు బృందాలుగా ఏర్పడి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల పాటు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం వల్ల కలిగే నష్టాలు, యువతులకు మోసపూరిత పరిచయాలు, ప్రేమలు వల్ల కలిగే అనర్థాలు, పిల్లలు తల్లిదండ్రులకు అబద్ధాలు చెప్పడం వల్ల కలిగే చెడు పరిణామాలు నాటక ప్రదర్శన ద్వారా చేసి చూపించారు. బుధవారం పట్టణంలోని గొంటివీధిలో ఒకటో పట్టణ, రెండో పట్టణ ఎస్ఐలు లక్ష్మి, ప్రవల్లికలు తమ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాలు నిర్వహించారు.